క్లుప్తంగా

జవాన్‌కు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని సట్వాజిగూడ గ్రామానికి చెందిన కాంబ్లే బాలాజీ ఆర్మీలో విధులు నిరనిర్వర్తించి ఉద్యోగ విరమణ పొంది శనివారం గ్రామానికి రావడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మండలంలోని అందునాయక్‌తండా చౌక్ నుంచి సట్వాజిగూడ గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా పార్టీల నాయకులతో పాటు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, ఎండీ జహీర్, రాథోడ్ సంజీవ్, అతిష్ కాంబ్లే పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ సెంటర్ ప్రారంభం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆధార్ నమోదు కేంద్రాన్ని తహసీల్దార్ సాయిమహేశ్ ప్రారంభించారు. ఇటీవల మావల తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆదిలాబాద్ రూరల్ కార్యాలయానికి మార్చబడిన ఆధార్ కేంద్రాన్ని పునఃప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈడీఎం రవి, మీసేవ ఆధార్ వీఎల్ఈ కొండ విశాఖ, ఆధార్ ఆపరేటర్ శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌ను శనివారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో ఆదిలాబాద్‌రూరల్ మండల ఎస్సీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మండలంలో ఉన్న పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. చంద్రయ్య, పుంద్రు నర్సింగ్, బండారి అశోక్, తదితరులు ఉన్నారు.

'గతంలో పని చేసిన వారినే కొనసాగించాలి'

బోథ్: గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్‌గా పని చేసిన వారికే ప్రస్తుతం అవకాశం ఇవ్వాలని కనుగుట్ట గ్రామానికి చెందిన కొటాడి స్వామి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గతంలో కేవలం నెలకు రూ.2000లకే స్కావెంజర్ పనులతో పాటు, మొక్కలకు నీరు పోయడం, పిల్లలని చూసుకోవడం చేసేవాళ్లమని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాల నిర్వహణ నిధులు ఇస్తుండటంతో, పాత వారికే స్కావెంజర్‌గా అవకాశం ఇవ్వాలని కోరారు.

సరుకుల పంపిణీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన ప్రవీణ్ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని గమనించిన బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందచేసి మానవత్వం చాటుకున్నారు. ఆయన వెంట సత్తన్న, గిరి, సాజిద్, శివన్స్, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

కరాటేలో గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న కౌశిక్ సింగ్

బోథ్: శ్రీలంకలో నిర్వహించిన సౌత్ ఆసియా కరాటే పోటీలో బోథ్ మండలంలోని గుర్రాల తండా గ్రామానికి చెందిన కైలాస్‌సింగ్ తనయుడు చౌహాన్ కౌశిక్ సింగ్ విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా నిర్వాహకుల చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. మారుమూల గ్రామానికి చెందిన యువకుడు కౌశిక్ సింగ్ సౌత్ ఆసియా స్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడంపై మండల వాసులు, గ్రామస్తులు ఆయనను అభినందించారు.

బోథ్ ఎస్సై బదిలీ

బోథ్: బోథ్ ఎస్సై రాము బదిలీ అయ్యారు. నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలానికి ఆయనను అధికారులు బదిలీ చేశారు. నిజామాబాద్ జిల్లా నుంచి ఎస్సై ప్రవీణ్ కుమార్ బోథ్ మండలానికి బదిలీపై వచ్చారు. మండల కేంద్రానికి చెందిన షటిల్ టీం సభ్యులు, సొనాల, గుర్రాలతండా గ్రామస్తులు, బీజేపీ నాయకులు బదిలీ అయిన ఎస్సై రామును శనివారం శాలువాతో సత్కరించారు. ప్రజలతో మమేకమై సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో షటిల్ టీం సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలకు తాళమే..!

- ఆన్‌డ్యూటీపై వెళ్తే మూసివేయాల్సిందే
- నష్టపోతున్న గిరిజన విద్యార్థులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటున్న తల్లిదండ్రులు



ఈఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని సాలాయిగూడ గిరిజన ప్రాథమిక పాఠశాల. ఇక్కడ 13 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికి ఒకే ఒక ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నారు. గురువారం ఎంఈవో కార్యాలయానికి ఆడిట్ కోసం వెళ్లగా తాళం వేసి కనిపించింది. దీంతో విద్యార్థులు విద్య పరంగా నష్టపోతున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మొలాల్‌గుట్ట ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల. ఇక్కడ ఉన్న 8 మంది విద్యార్థులకు ఒకే ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. వీరికి బోధన చేసే ఉపాధ్యాయుడు గురువారం ఆడిట్ పని కోసం ఎంఈవో కార్యాలయానికి వెళ్లారు. దీంతో పాఠశాలకు తాళం పడింది.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ కాంప్లెక్స్ పరిధిలో మొత్తం 22 గిరిజన ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈపాఠశాలలో 1, 2వ తరగతులు చదువుకుంటున్నారు. ఇదిలా ఉండగా.. ఆయా పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులు విద్యనభసిస్తున్నారని కాంప్లెక్స్ పరిధిలోని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. ఒకే టీచర్ ఉన్న చోట ఆ ఉపాధ్యాయుడు ఆన్ డ్యూటీపై వెళ్తే పాఠశాల మూసి వేయాల్సిన దుస్థితి నెలకొంటుంది. దీంతో విద్యార్థులు చదువు పరంగా నష్టపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

ఆన్‌డ్యూటీపై 16 మంది ఉపాధ్యాయులు

మామిడిగూడ కాంప్లెక్స్ పరిధిలోని 22 టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలు ఉండగా గురువారం 16 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుడు గురువారం ఆదిలాబాద్ ఎంఈవో కార్యాలయానికి ఆడిట్ కోసం ఆన్ డ్యూటీపై వెళ్లారు. అక్కడ మరోక ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఆ రోజు పాఠశాలలు మూసి ఉంచావాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా పాఠశాలల పరిధిలోని సుమారు 170 నుంచి 200 మంది విద్యార్థులు ఆరోజు విద్య నష్టపోవాల్సి వచ్చింది.

ఆన్‌డ్యూటీపై వెళ్లారు

తమ కాంప్లెక్స్ పరిధిలోని కొన్ని ప్రాథమిక పాఠశాలలకు సింగిల్ ఉపాధ్యాయులు ఉన్నారు. మండలంలో కొన్ని టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు గురువారం ఆడిట్ కోసం ఎంఈవో కార్యాలయానికి ఆన్‌డ్యూటీపై వెళ్లారు. దీంతో ఆ పాఠశాలలను తెరువలేకపోయారు. ఈవిష యం ఉన్నతాధికారుల దృష్టిలో సైతం ఉంది.

– ఆర్క నగేశ్, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్, మామిడిగూడ

కొనసాగుతున్న శబరిమాత అఖండజ్యోతి



భక్తులను సన్మానిస్తున్న గ్రామస్తులు

తలమడుగు: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆర్లి(కె) గ్రామంలో శబరిమాత భక్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శబరిమాత అఖండజ్యోతి కొనసాగుతోంది. శనివారం కజ్జర్ల గ్రామానికి చెందిన శబరిమాత భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు దేవరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో శ్రావణ మాసంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. నెలరోజులపాటు నిర్వహించే శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమంలో జిల్లా నలుమూల నుంచి కాకుండా మహారాష్ట్ర, కామారెడ్డి జిల్లా నుంచి శబరిమత భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడం జరుగుతుందన్నారు. శబరిమాత నిర్వహణ కమిటీ సభ్యులు బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, మాజీ మున్సిపల్ కమిషనర్ దేవారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వన మహోత్సవం



మొక్కలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: మండల వ్యాప్తంగా సనాతన ధర్మసేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం వనమహోత్సవ నిర్వహించనున్నారు. వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ మహరాజ్ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. శ్రీరామ చరిత్ మానస్ హన్మన్ చాలీస్ రచయిత గోస్వామి తులసీదాస్ గారి జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో రెండు వేల మొక్కలు పంపిణీ చేశారు. మొక్కలతోనే మానవ మానుగడ సాధ్యమన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను సంరక్షించాలని కోరారు.

పరామర్శ

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చ నారాయణ కుటుంబాన్ని శనివారం అధ్యాపకులు సంఘం రాష్ట్ర కార్యదర్శి బలరాం జాదవ్ పరామర్శించారు. మచ్చ నారాయణ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. దీంతో బలరాం జాదవ్ వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలన్నారు.

బ్యాంకుల్లో దళారీ వ్యవస్థను అరికట్టాలి

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని బ్యాంకుల్లోని దళారులు నిలువు దోపిడీ చేస్తున్నారని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ సంతోష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ, భీంపూర్, తాడిహత్నూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో దళారుల ఇష్టారాజ్యం కొనసాగుతుందన్నారు. బ్యాంకు ఖాతాదారులు స్వయంగా వెళ్లి అడిగితే నెలల తరబడి పని కావడం లేదని, అదే పనిని దళారులు తీసుకెళ్లిస్తే క్షణంలో అధికారులు చేసేస్తున్నారని ఆరోపించారు. కనీసం రుణం ఎంత మంజూరు అయింది ఎంత ఇస్తున్నారో కూడా గిరిజనులకు తెలిజేయడం లేదన్నారు. అధికారులు స్పందించి బ్యాంకులలో దళారీ వ్యవస్థను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



కందిని సన్మానిస్తున్న కాలనీవాసులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్ కాలనీవాసులతో కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కాలనీలోని హనుమాన్ ఆలయంలో కాలనీవాసులతో సమావేశమై అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అయనకు ఘనంగా స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు పూలబొకే, శాలువాతో సత్కరించారు. అనంతరం ఖానాపూర్ కాలనీలో గల మదర్సాను సందర్శించి ముస్లిం మతపెద్దలతో భేటీ అయ్యారు. కందితో పాటు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీని ముస్లిం మత పెద్దలు సత్కరించారు. మిఠాయిలు తినిపించారు. మదర్సా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అలాగే కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, గిమ్మ సంతోష్, ఆయా కాలనీవాసులు, ముస్లిం మత పెద్దలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు పాకిన డ్రోన్ వ్యవసాయం

- డ్రోన్‌లతో పిచికారీ చేస్తున్న రైతులు
- నీరు, సమయం ఆదా
- కూలీల కొరతకు చెక్



డ్రోన్‌తో పిచికారీ చేస్తున్న ఆపరేటర్

జైనథ్: ఒకప్పుడు డ్రోన్‌లను ఆర్మీ, నిఘా సంస్థలు మాత్రమే వాడేవి. ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్‌లు అందరికీ అందుబాటులోకి రావడంతో డ్రోన్‌లపై అవగాహన పెరిగింది. డ్రోన్‌లతో ఫొటోలు, వీడియోలు తీయడంతో పాటు వస్తువులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి డెలివరీ చేయడం ప్రారంభించారు. అయితే ప్రస్తుతం వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వాడకం పెరిగింది. కూలీల కొరత లేకుండా తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో ఒకే వ్యక్తి వందల ఎకరాల్లో సునాయాసంగా క్రిమిసంహారక మందు పిచికారీ చేయవచ్చు. 3- 4 లక్షల ఖరీదు ఉన్నప్పటికీ కొంత మంది పెద్ద రైతులు సొంతగా కొనుగోలు చేసుకుంటున్నారు. మరికొంత మంది డ్రోన్‌లను అద్దెకు తీసుకొని, పురుగుల మందు పిచికారీకి వినియోగిస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలో రైతు గడ్డం నారాయణ రెడ్డి, తన చేన్లో అద్దెకు తెచ్చిన డ్రోన్‌తో పిచికారీ చేయించారు. కేవలం 2 గంటల్లో పది ఎకరాల సోయా పంటకు పిచికారీ చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

మూవీ డైరెక్టర్‌కు సన్మానం



డైరెక్టర్‌ను సన్మానిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

కైలాస్‌నగర్: అలనాటి రామచంద్రులు మూవీ డైరెక్టర్ ఆకాష్‌రెడ్డిని రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. స్థానిక విద్యానగర్‌లోని సంఘ భవనంలో పూలమాల, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆకాష్ కష్టపడి ఎదిగారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నల్ల నారాయణ రెడ్డి, కిష్టారెడ్డి, గోపిడి రాంరెడ్డి, చిట్యాల సుహాసినిరెడ్డి, శ్రీదేవి, రకుల్ రెడ్డి, నలిమేల నవీన్ రెడ్డి, అట్ల గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూలిన భారీ వేపచెట్టు



విరిగిపడిన వేపచెట్టు

బోథ్: మండల కేంద్రంలోని షాదీఖానా వద్ద ఉన్న భారీ వేపచెట్టు శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో నేలకొరిగింది. ఈవృక్షాన్ని వందేళ్ల క్రితం నాటిదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎలాంటి గాలి వీయకున్నా, పిడుగు పడకున్నా.. వృక్షం కాండం రెండుగా చీలి పడిపోయింది. కాగా చెట్టుకు ఓ రైతు శుక్రవారం రాత్రి గేదెను కట్టేసి ఉంచాడు. చెట్టు పడిపోయినా ఆ గేదెకు మాత్రం ఇలాంటి గాయాలు కాలేదు. గ్రామస్తులు జేసీబీ సహాయంతో చెట్ల కొమ్మలను తొలగించారు.

ఆడిటోరియం పనులు ప్రారంభం



పిల్లర్ల దశలో ఆడిటోరియం నిర్మాణ పనులు

- సాఫీగా సాగేనా?.. అర్ధంతరంగానే ఆగేనా?
- పిల్లర్ల దశలో పనులు
- పట్టణ ప్రజల రెండేళ్ల నిరీక్షణకు తెర

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆడిటోరియం నిర్మాణానికి ఎట్టకేలకు ముందడుగు పడింది. సదరు కాంట్రాక్టర్ ఆలస్యంగానైన పనులు ప్రారంభించారు. ప్రస్తుతం బేస్‌మెంట్ దశలో పనులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సీఎం హామీ నిధులు రూ.5కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టేందుకు 2022 అక్టోబర్ 5న అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కావడంతో అప్పట్లోనే పనులు ప్రారంభమవుతాయని అంతా భావించారు. కానీ రెండేళ్లుగా పనులు చేపట్టేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్ ఎట్టకేలకు పనులు ప్రారంభించారు.

రూ.5 కోట్ల వ్యయంతో..

ప్రభుత్వ పరంగా నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాలు, పండుగ వేడుకలు, మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలతో పాటు ప్రైవేట్‌పరంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక వేదికంటూ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వేలాది రూపాయల అద్దెలు చెల్లిస్తూ కార్యక్రమాలను నిర్వహించుకోవాల్సి వస్తోంది. ఇలాంటి ఇబ్బందులను తొలగించాలనే ఉద్దేశంతో ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ ఆడిటోరియం నిర్మాణం చేపట్టాలని 2022లో తీర్మానించింది. రూ.5కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం కైలాస్‌నగర్‌లోని అధికారిక నివాసాలు (వైట్ క్వార్టర్స్)లను తొలగించిన ప్రాంతంలో ఎకరంన్నర స్థలాన్ని కేటాయించారు. అదే సంవత్సరం దీని నిర్మాణం కోసం టెండర్లను ఆహ్వానించగా ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన ఓ కాంట్రాక్టర్ ఆడిటోరియం నిర్మాణ పనులను దక్కించుకున్నారు.

రెండేళ్ల తర్వాత పనులకు మోక్షం

2022వ సంవత్సరంలో ఆడిటోరియం నిర్మాణ టెండర్ల ప్రక్రియ పూర్తికావడంతో అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న 2022 అక్టోబర్ 5వ తేదీన పనుల ప్రారంభోత్సవం చేసి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. అయితే సదరు కాంట్రాక్టర్ పనులను చేపట్టకపోవడంతో గత రెండేళ్లుగా ఆ శిలాఫలకం వెక్కిరించింది. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయా అని ఎదురుచూసిన ప్రజలు కాంట్రాక్టర్ నిర్వాకంతో విసుగు చెందారు. ఇదిలా ఉంటే సదరు కాంట్రాక్టర్ ఉన్నపాటుగా ఆడిటోరియం నిర్మాణ పనులను ప్రారంభించారు. పిల్లర్ల దశలో ఉన్నటువంటి ఈ పనులు ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్నాయి. రెండేళ్లుగా పనులు చేపట్టేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్ తనకు తానుగా పనులు చేపట్టడంతో బల్దియా అధికారులు సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు. అయితే పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోవడం, ఎస్ఎఫ్‌సీ, ఎఫ్ఎఫ్‌సీ నిధులు ఇలాంటి భారీ వ్యయంతో కూడిన పనులు చేపట్టేంతగా లేకపోవడంతో బల్దియాలో ఇటీవల ఎలాంటి అభివృద్ధి పనులు జరుగడం లేదు. నిధుల లేమి కారణంగా ఇది వరకు చేపట్టిన ఇండోర్ స్టేడియంతో పాటు పలు సీసీ, తారు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ ఈ నిర్మాణాన్ని సాఫీగా పూర్తి చేస్తారా లేక ఇతర కాంట్రాక్టర్ల మాదిరిగానే బిల్లులు రాలేదంటూ అర్ధంతరంగా నిలిపివేస్తారా అనేదీ చర్చనీయాంశంగా మారింది. ఆలస్యంగానైన పనులు ప్రారంభం కావడంపై హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు దాన్ని మధ్యలోనే ఆపేయకుండా నిర్ధీత గడువులోగా పూర్తిచేసేలా చూడాలని కోరుతున్నారు. నిర్మాణం పూర్తైతేనే ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలతో పాటు ప్రైవేట్ కార్యక్రమాలు సైతం సులువుగా నిర్వహించుకునే వెసులుబాటు కలుగనుండగా అందుకు సంబంధించిన ఇబ్బందులు తొలగిపోయే అవకాశం ఉంది.

నిధుల కొరత ఉంది

పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధుల కొరత ఉన్నమాట వాస్తవమే. అయితే సీఎం హామీ నిధులు రూ.5కోట్లతో ఆడిటోరియం నిర్మాణం కోసం రెండేళ్ల కిందటనే టెండర్లను నిర్వహించాం. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండేళ్ల తర్వాత తనంతటతానే స్వచ్ఛందంగా ముందుకొచ్చి పనులను ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది.

– తిరుపతి, మున్సిపల్ డీఈ, ఆదిలాబాద్

మహాసభలను జయప్రదం చేయండి

ఉట్నూర్‌రూరల్: ఈనెల 13న నిర్వహించే ప్రగతిశీల మహిళా సంఘం ఆదిలాబాద్ జిల్లా ఏడో మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సభ కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రగతిశీల మహిళా సంఘం నిరంతరం మహిళల హక్కుల కోసం, మహిళా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. మహిళలపైన జరుగుతున్న లైంగిక దాడులకు వ్యతిరేకంగా, మహిళలపై అకృత్యాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. పెర్క గంగమ్మ, లక్ష్మి, రాధ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై పట్టింపేది?



చోర్గావ్ గ్రామంలో పెరిగిన పిచ్చి మొక్కలు

నార్నూర్: గిరిజన గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. నార్నూర్ మండలంలోని చోర్గావ్ గోండుగూడ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా మురుగునీరు చేరడంతో చెరువును తలపిస్తుంది. ఎక్కడపడితే అక్కడ పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు అవాసంగా మారుతుంది. చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారికి దోమల బెడద అధికంగా ఉంది. మలేరియా, అతిసారా, డెంగ్యూ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. భారీగా పిచ్చి మొక్కలు ఉండడంతో రాత్రిసమయంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి నిల్వ ఉన్న నీటిని తొలగించడంతో పాటు పిచ్చి మొక్కలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జోగు రామన్నకు పరామర్శల వెల్లువ



పరామర్శిస్తున్న రాథోడ్ బాపురావు

జైనథ్: మాజీ మంత్రి జోగు రామన్నకు పరామర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల జోగు రామన్న సోదరుడు జోగు పోతారెడ్డి మృతి చెందారు. శనివారం మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు ఈశ్వరీ బాయి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాబాయి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గంధ్రత్ సుజాత దీపాయిగూడకు వెళ్లి, పోతారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జోగు రామన్న, జోగు పోతారెడ్డి కుమారుడు రుపేందర్‌లను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.